క్లుప్తంగా

మెరుగైన సేవలందించడమే లక్ష్యం


ఫెడరల్ బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అదనపు జిల్లా జెడ్జి శైలజ

హిందూపురం అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి నమ్మకమైన బ్యాంకింగ్ భాగస్వామిగా ఫెడరల్ బ్యాంక్ ఎదగాలని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లి శైలజ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఫెడరల్ బ్యాంక్ నూతన శాఖను ప్రారంభించారు. ఏటీఎం కేంద్రాన్ని వైద్యుడు వెంకటరమణ నాయక్ ప్రారంభించారు. స్ట్రాంగ్ రూం, సేఫ్ డిపాజిట్ లాకర్లను ప్రముఖ ఆడిటర్ ప్రసాద్ ప్రారంభించారు. ఖాతాదారులకు సేవలందించడమే పరమావధిగా బ్యాంక్ పని చేస్తుందని ఫెడరల్ బ్యాంక్ బెంగళూరు జోన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్, తిరుపతి ఏరియా హెడ్ స్వాతి ప్రియ, బ్రాంచ్ హెడ్ శారద పాల్గొన్నారు.

చట్టాలపై న్యాయవాదులకు అవగాహన


మాట్లాడుతున్న న్యాయమూర్తి

పెనుకొండ: పట్టణంలోని కోర్టు హాల్‌లో నూతన చట్టాలపై న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నేరాలు, డిజిటల్ పత్రాల చెల్లుబాటు, శిక్షలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ వివరించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి


కదిరేపల్లిలో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడు

మడకశిరరూరల్: మండలంలోని కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు కోరారు. ఆయన శనివారం కదిరేపల్లి పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆనంతరం ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. రెండు రోజుల నుంచి వర్షం పడుతుండడంతో భూమిలో తేమశాతం ఉందని పనులు చేయడానికి ఎంతో అనుకూలంగా ఉందన్నారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

అగళి: మండల కేంద్రంలో ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ శనివారం తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అగళి: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఆ సంస్థ ఆద్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మడకశిర ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్య వివాహాలను అరికడదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పద్మ, ఏటీఎల్ ఓబులేస్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ

రొద్దం: మండలంలోని తురకలాపట్నం జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు కాలనీవాసులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

బీసీజీ టీకాతో క్షయ నివారణ


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నివారించొచ్చని డీపీఓ నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని చల్లాపల్లి, జూలకుంట గ్రామాల్లో వైద్యశాఖ విజిలెన్స్ టీమ్ పర్యటించింది. ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించింది. కార్యక్రమంలో డీపీఏహెచ్‌ఎన్ ఈరమ్మ, వైద్యుడు హరికుమార్, టీమ్ మేనేజర్ సుబ్బరావు, హెల్త్ సూపర్ వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, సీహెచ్‌ఓ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి


పెనుకొండ: అలంకరణలో వాసవీమాత


సోమందేపల్లి: వాసవీమాతకు పూజలు


పావగడ: వెండి రథంపై వాసవీమాత దర్శనం

మడకశిర: పట్టణంలో శనివారం కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కన్యకాపరమేశ్వరి విగ్రహానికి ఉదయం నుంచి సాయంకాలం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గుడిబండ: మండల కేంద్రంలో శనివారం ఆర్యవైశ్యులు వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆనంతరం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వినియోగం, అన్నదానం చేపట్టారు.

అగళి: స్థానిక వాసవీ కన్యకాపరిమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శంకర్‌రావు వేకువజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి వివిధ దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.102 గోత్రాలకు తాంబూల సమర్పణ, సామూహిక అర్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పానకం, పెసర బేడలు పంపిణీతోపాటు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు.

పావగడ: కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. స్థానిక ఆంజనేయ స్వామి కల్యాణ మంటపంలో వాసవి మాత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ముత్తయిదువలు పూర్ణ కుంభ కలశాలను మోసుకుని ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం పిండి దీపాలతో హారతులు వెలిగించారు. 9 మంది కన్యల కు కన్యకా పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్య వైశ్య యువకులు బైకు ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం బంగారు రథంలో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు.

అమరాపురం: మండల కేంద్రంలో శనివారం వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఆర్య వైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తమ ఇంటి నుంచి కలశాలతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. అనంతరం అర్చకుడు నరసింహభట్టాచార్యులు అమ్మవారిని వెండి ఆభరణాలు, పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అర్చకులు వాసవీ మాత జీవిత చరిత్రను చదివి వినిపించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. హేమావతి గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవాంబ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

రొళ్ల: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలను శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు కలశాలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు చేసి జ్యోతులను సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

హిందూపురం: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని మూలవిరాట్‌కు ఉదయం నుంచే అభిషేకాలు, పూజలు చేపట్టారు.
ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుంచి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్నమార్కెట్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ మహిళా మండలి, వాసవీ భజన బృందం, కుసుమపుత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం వీడీ రోడ్డులోని ధర్మశాలలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు జేపీకే రాము, పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని వాసవీమాత జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఉదయం ఆర్య వైశ్య మహిళలు వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు చేశారు.

పెనుకొండ: పట్టణంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి చిత్రపటంతో ఆర్యవైశ్యులు పట్టణంలో ప్రత్యేక భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం వాసవీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలతోపాటు మహిళలు జ్యోతుల మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానంతో పాటు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రామయ్య, రంగయ్య, అశ్వర్థ నారాయణ, రవీంద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు శనివారం వాసవీ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.


రొళ్ల కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు


హిందూపురం పట్టణంలో బైక్ ర్యాలీ


గుడిబండలో కలశాల ఊరేగింపు


రొద్దం: పూజల్లో పాల్గొన్న భక్తులు

రేపటి నుంచి లక్ష్మీ వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు

మడకశిర: పట్టణంలోని లక్ష్మీ వేంకరటమణస్వామి ఆలయంలో సోమవారం నుంచి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా 20న శ్రీ వారికి అభిషేకం, అంకురార్పణ, 21న ధ్వజారోహణ, 22న శ్రీవారి కల్యాణోత్సవం, 23న బ్రహ్మరథోత్సవం, 24న పారువేట ఉత్సవం, 25న శ్రీవారి శయనోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

22న చౌడేశ్వరీ దేవి జాతర

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పి.సడ్లపల్లి గ్రామంలో ఈనెల 22వ తేదీన (మంగళవారం) చౌడేశ్వరీ దేవి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గంగపూజ, మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రత్యేక పూజలు, ఉదయం 9 గంటలకు గ్రామోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డుపై చెత్త పడేస్తున్నారని ఎంపీడీఓకు ఫిర్యాదు

గోరంట్ల: స్థానిక రాగికుంట చెరువు రోడ్డు పక్కన చెత్త కుప్పలతో దుర్వాసన వస్తోందని స్థానిక ప్రజలు ఎంపీడీఓ కార్యాలయ ఏవో సూర్యనారాయణకు శనివారం వినతిపత్రం అందించారు.

ఐఎఫ్ఎస్ ర్యాంకర్‌కు సన్మానం


ఐఎఫ్ఎస్ ర్యాంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ కౌన్సిలర్ సుధాకరరెడ్డి, రెడ్డి సోదరులు ఐఎఫ్ఎస్ ర్యాంకర్ వాసంతిని శనివారం సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పని చేసిన అధ్యాపకులు గోవిందరెడ్డి కుమార్తె వాసంతి ఐఎఫ్ఎస్‌లో ఆలిండియా 50వ ర్యాంకు సాధించారు. గోరంట్ల మండలం గౌనివారిపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి గురువుతోపాటు ఆయన కుమార్తె వాసంతిని సన్మానించారు. ఈసందర్భంగా సుగుణాకర రెడ్డి, మహేష్‌రెడ్డి, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతలకు ప్రభుత్వం శుభవార్త

- రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- 47,505 మంది రైతులకు రూ.28.62 కోట్ల లబ్ధి

మడకశిర: నియోజకవర్గంలోని అన్నదాతలకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేశారు. 2023 ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసి నష్ట పోయిన రైతుల ఖాతాల్లోకి శనివారం ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఖాతాల్లోకి జమ అయిన వెంటనే రైతుల ఫోన్‌లకు బ్యాంకుల నుంచి మెసేజ్‌లు వచ్చాయి. ఈమెసేజ్‌లను చూసి అన్నదాతల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. వైఎస్ జగన్ రైతుల పక్షపాతి అనడానికి ఇంతకన్నా నిదర్శనం కావాలా? అని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారీగా లబ్ధి..
నియోజకవర్గంలోని 5 మండలాలకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.28.62 కోట్లు మంజూరైంది. 47,505 మంది రైతులకు లబ్ధి చేకూరింది. అగళి మండలంలోని 9,023 మంది రైతులకు రూ.4.33 కోట్లు, అమరాపురం మండలంలోని 7,066 మంది రైతులకు రూ.5.84 కోట్లు, గుడిబండ మండలంలోని 11,484 మంది రైతులకు రూ.6.55 కోట్లు, మడకశిర మండలంలోని 9,145 మంది రైతులకు రూ.5.75 కోట్లు, రొళ్ల మండలంలోని 10,787 మంది రైతులకు రూ.6.13 కోట్ల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా 2023 ఖరీఫ్‌లో 19,695 హెక్టార్ల పంట నష్టానికి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసి రైతులను ఆదుకోవడం గమనార్హం. ఇంతకు మునుపు ఇన్‌పుట్ సబ్సిడీని రైతుల ఖాతాల్లో జమ చేయకూడదని ఈసీ ఆంక్షలు విధించింది. అయితే ఇటీవల ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయడం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

చికెన్ సెంటర్లను తొలగించండి

పావగడ: పట్టణంలోని పెనుగొండ ఊరువాకిలి ప్రాంతంలో చికెన్ సెంటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బీజేపీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి సిపి మురళీధర్ ఏసీ గోటూరి శివప్ప వాహనం ఎదుట బైఠాయించి శనివారం ఆందోళన చేపట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరితాత్మక పెనుగొండ ఊరువాకిలి ప్రాంతంలో నిర్వహిస్తున్న నాలుగైదు కోడి మాంసం అంగళ్ల దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నాడు. ఆ ప్రాంతంలో వెళ్లడానికి మహిళలు, వృద్ధులు, పిల్లలు కుక్కల బెడద తో భయాందోళనలకు గురవుతున్నారన్నాడు. వెంటనే ఆ కోడి మాంసం అంగళ్లను ప్రత్యేక స్థలం లో ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశాడు. స్పందించిన ఏసీ వెంటనే వాటిని తొలగించాలని స్థానిక మున్సిపల్ సీఓ షంషుకు ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హిందూపురం టౌన్: ముద్దిరెడ్డిపల్లి చేనేత, పవర్ లూమ్స్ నాయకుల ఆధ్వర్యంలో దండు రోడ్డులోని లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సప్తగిరి మెడికల్ కాలేజీ రీసెర్చ్ సెంటర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల బెంగళూరు వారి సహకారంతో దాదాపు 300 మందికి ఎకో, ఈసీజీ, కార్డియా ఫిట్ నెస్, బీపీ, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. 30 మందిని బెంగళూరు సప్తగిరి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు రెఫర్ చేశారు. అఖిలాంధ్ర పట్టు చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఏసీ నాగరాజు, బండారు బాలాజీ, పల్లా లక్ష్మీ కుమార్, మంచాల మారుతి పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

మడకశిర: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో శనివారం ఆలయ 14వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు సాయిబాబా విగ్రహానికి ఉదయం నుంచి సాయంకాలం వరకు వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సాయి కీర్తనలు ఆలపించారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి పూజలు


స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

పావగడ: స్థానిక శనీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన శనీశ్వరస్వామికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామితోపాటు శీతలాంభదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్ని గుండానికి భక్తులు టెంకాయలు కొట్టి కోరిక తీర్చుకున్నారు. నల్ల నువ్వు వత్తులు, నువ్వుల నూనె, నల్ల వస్త్రాలు అగ్ని గుండంలోకి విసర్జించి మొక్కులు తీర్చుకున్నారు.

కరుణించిన వరుణుడు


మడకశిర మండలం గౌడనహళ్లి వద్ద పారుతున్న వంక

మడకశిరరూరల్: మండలంలో శుక్రవారం సాయంత్రం, రాత్రి కురిసిన వర్షం 51.6 ఎంఎంగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆమిదాలగొంది, చెండకచెర్లు, గౌడనహళ్లి పంచాయతీల్లో చిన్న చిన్న వంకలు ప్రవహించి కుంటలకు వర్షపు నీరు చేరింది. ఈఏడాది ఖరీఫ్ వేరుశనగ పంట సాగుకు రైతులు ముందస్తుగా భూములను కాడ్డెదలు, ట్రాక్టర్ ద్వారా భూములను సిద్ధం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో దొడ్డేరి సమీపాన దొడ్డేరమ్మ ఆలయం వద్ద గల పెద్ద వంక పారింది. వర్షం నిలిచిన తర్వాత పారుతున్న వంకను చూసేందుకు కాకి, దొడ్డేరి, అప్పేపల్లి, దొడ్డేరి, అలుపనపల్లి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తండోపతండాలు తరలివచ్చారు. ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందస్తుగా కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు రైతులు నేలను దుక్కిదున్ని సిద్ధం చేసుకుంటున్నారు.

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షం రాకతో రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల నుంచి చినుకు లేక వక్కతోటలు ఎండు ముఖం పట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. శుక్రవారం, శనివారం రోజు కురిసిన వర్షానికి కాస్తా ఊరట లభించిందని రైతులు అంటున్నారు.

మండలంలో మోస్తరు వర్షం..

చిలమత్తూరు: మండలంలో పలుచోట్ల శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. సుమారు గంటపాటు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


రొద్దం సమీపంలో కుంటలోకి చేరిన నీరు

పరిగి: మండలంలో శనివారం వరుణదేవుడు కరుణించాడు. వేసవి కావడంతో ఎండలు మండుతుండేవి. ఎండవేడిమితోపాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

పెనుకొండ: మండలంలో శనివారం సాయంత్రం జోరు వాన కురిసింది. గత కొన్ని నెలలుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బంది పడిన జనం జోరుగా కురిసిన వానతో ఊరట చెందారు .

రొద్దం: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాగులు, వంకలు, చెక్ డ్యాంలు పొంగి పొర్లాయి. భారీ వర్షంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలను దుక్కి చేసుకోవడానికి అనువుగా వర్షం పడిందని రైతులు చెప్తున్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

హిందూపురం టౌన్: ఖరీఫ్ 2024కు సంబంధించి రాయితీ వేరుశనగ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాధికారి సురేంద్రనాయక్ రైతులకు సూచించారు. శనివారం పూలకుంటలోని రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 0–0.50 ఎకరాలు ఉన్న రైతుకు 30 కేజీల బ్యాగ్ ఒకటి, 0.51– 1.0 ఎకరాలు ఉన్న రైతుకి 30 కేజీల బ్యాగులు రెండు, 1.01 ఎకరాల పైనున్న వారికి 30 కేజీల బ్యాగులు 3 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కె6 రకం విత్తనానికి సంబంధించి 30 కేజీల 1 బ్యాగ్ పూర్తి ధర రూ.2,850 ఉండగా, అందులో సబ్సిడీ (40%) రూ.1,140 పోగా.. రూ.1,710 చెల్లించాలన్నారు. అలాగే, 60 కేజీల 2 బ్యాగ్‌ల పూర్తి ధర రూ.5,700 ఉండగా, అందులో సబ్సిడీ రూ.2,280 పోగా రూ.3,420 చెల్లించాలని, అలాగే, 90 కేజీల 3 బ్యాగ్ ల పూర్తి ధర రూ.8,550 ఉండగా, అందులో సబ్సిడీ రూ.3,420 రూపాయలు పోగా రూ.5,130 చెల్లించాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, రాయితీ వేరుశనగ విత్తనాలు అవసరమున్న రైతులు సంబంధించిన రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదార్ పాస్ బుక్, ఆధార్, ఫోన్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు.


హిందూపురంటౌన్: వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ సురేంద్ర నాయక్

సబ్సిడీ విత్తన వేరుశనగ ధర ఖరారు

మడకశిర: ఖరీఫ్‌లో రైతులకు అందించే వేరుశనగ విత్తనం ధర ఖరారైనట్లు స్థానిక ఏఓ తిమ్మప్ప తెలిపారు. సబ్సిడీ పోను కే-6 రకం విత్తనం బస్తా ధర (30 కేజీలు) రూ.1,710 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కదిరి లేపాక్షి రకం విత్తనం సబ్సిడీ పోను ఒక బస్తా ధర (30 కేజీలు) రూ.1,566 ఉంటుందని తెలిపారు. ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.

గుడిబండ: మండలంలోని ఆర్బీకేల్లో సోమవారం నుంచి విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ వీరనరేష్ ఆర్బీకే సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విత్తన కాయల ధర వివరాలను ఆర్బీకేలో నోటీసు బోర్డులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిగి: మండలంలోని వేరుశనగ సాగు చేసే రైతులకు సబ్సిడీ ధరతో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని ఏఓ విజయభారతి తెలిపారు. రైతులు మొబైల్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలు ఆర్బీకేలకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఆర్బీకేల్లో సంప్రదించాలి..

చిలమత్తూరు: ఖరీఫ్‌లో పంటల సాగుకోసం ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలను అందించనున్నట్లు ఏఓ వంశీకృష్ణ పేర్కొన్నారు.ఈ మేరకు ప్రతి ఆర్బీకే కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని రైతులను ఆయన కోరారు.0.5 ఎకరాలలోపు వారికి 30 కిలోల బ్యాగు, 0.5 నుండి 1 ఎకరంలోపు వారికి రెండు బ్యాగులు, ఎకరం పైన ఉన్న వారికి గరిష్టంగా 3 బ్యాగులు సబ్సిడీ క్రింద అందజేయనున్నట్లు తెలిపారు. కె6 రకం 30 కిలోల బ్యాగు ధర రూ.2,850 ఉండగా, సబ్సిడీ రూపంలో రూ.1,140 చెల్లిస్తుందని,రూ.1,710 రైతు చెల్లించాలని తెలిపారు.

సజావుగా రుణాల రెన్యూవల్

లేపాక్షి: రుణాల రెన్యూవల్స్ కొనసాగుతున్నాయి. స్థానిక ఏపీజీబీలో 3 వేల మంది రైతులు పంట రుణాలు తీసుకోగా ఇప్పటి వరకు 500 మంది రైతులు రెన్యూవల్స్ చేసుకున్నారని మనేజర్ జబీవుల్లా శనివారం పేర్కొన్నారు.